# మినీ కథలు.




## విక్రమార్కుడు పట్టువదలేదు.

అప్పటికి నాలుగు సార్లు అసెంబ్లీకి నిలబడి చిత్తుగా ఓడిపోయాడు. విక్రమార్కుడు ఎలాగైనా సరే ఎం. ఎల్. ఏ. కావాలని, లీడరుగా మంచిపేరు తెచ్చుకోవాలని పట్టుదలగా వున్నాడు. ఎలాగో తంటాలుపడి ఐదోసారి కూడా టిక్కెట్టు సంపాయించుకోగలిగాడు. ఆ సంపాయించుకున్న టిక్కెట్టు జేబులో పెట్టుకొని ఆనందంతో చిందులు తొక్కుతూ ఇంటిముఖం పట్టిన తరుణంలో-విక్రమార్కుడి జేబులో వున్న టిక్కెట్టుకు ప్రాణం వచ్చి మాట్లాడటం ప్రారంభించింది—

"విక్రమార్కా! నాలుగుసార్లు ఓడిపోయి మళ్ళి నా కోసం నానా హైరానాపడి నిలబడుతున్నావు- ఐదోసారి! ఇలా నీలాగా టిక్కెట్టుకోసం నానా ప్రయాసలుపడి బోలెడు డబ్బు ఖర్చుపెట్టి సోదిలోకి కూడా రాకుండా పోయినవాళ్ళు చాలామంది వున్నారు. అలాంటి ఒక ఓడిపోయిన లీడరు కథ నీకు చెబుతాను. ఆలకించు!' కొన్ని సంవత్సరాలకు పూర్వం ఒక వూళ్లో బకాసురుడికి ఎం. ఎల్. ఏ. కావాలనిపించింది. తాత ముత్తాతల నాటి ఆస్తిసొంతం కరగలేదు! కరిగించకుండా ఇంకొంచెం మిగిలింది! ఆ ఆస్తి చూసుకొని ఎన్నికల్లో పోటీ చేశాడు. ఘనంగా ఓడిపోయాడు. ఇలా ఐదు సార్లు నిలబడి. ఐదు సార్లూ ఓడిపోయాడు. ఉన్న ఆస్తి కాస్తా హాళ్ళికి హాళ్ళి సున్నకు సున్నా అయింది. బకాసురుడు కాస్తా బక్కచిక్కి బకంలాగా తయారయ్యాడు"

టిక్కెట్టు ఒక్క క్షణం ఆగి— "ఏమయ్యా! మార్కుడూ! నాకో సందేహం వచ్చింది! ఒకసారి చిత్తుగా ఓడిపోయిన ఆ బకాసురుడు మాటిమాటికీ ఎలక్షన్‌లో ఎందుకు నిలుచున్నట్టు? ఉన్న కొద్దిపాటి ఆస్తికూడా ఎందుకు కరిగించేసుకున్నట్టూ? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసి వుండికూడా చెప్పకపోయావూ- నీ తల వెయ్యి చెక్కలవుతుంది- చెప్పు" అని టిక్కెట్టు రెట్టించింది.

అప్పుడు విక్రమార్కుడు ఇలా చెప్పాడు.

"నిజమే! బోలెడు ఖర్చుపెట్టి ఎలక్షన్లలో నిలబడ్డాడు. మాటిమాటికీ ఓడిపోయాడు. ఊరుకోవాల్సిందే. అయితే అతను అనుకున్నదేమిటంటే ఎలక్షన్లలో గెలిస్తేమటుకు పాతిక సంవత్సరాల కాలంలో పోగొట్టుకున్న ఆస్తి యావత్తూ ఐదు సంవత్సరాల్లో రాబట్టుకోలేనా అని ఆ నమ్మకంతోనే ఐదుసార్లు నిలబడ్డాడు."




## మీనాక్షి బాగా పాటలు పాడుతుంది.

శాస్త్రీయ సంగీతాన్ని నేర్పించాలని తల్లి ఎంతగానో ప్రయత్నించింది. కుదరలేదు. అట్లని మీనాక్షికి సంగీతం వంటపట్టలేదా అంటే నేను వొప్పుకోను. ఆమె పాడే కృతుల్లో "నగుమోము గనలేని..." కృతి నన్నెంతగానో ఆకర్షించింది.

ఆమెది ఒక విచిత్రమైన వ్యక్తిత్వం దేనికీ శ్రద్ధ చూపించేది కాదు. దేనికీ కట్టుబడేరకం కాదు. మంచికంఠం. సంగీతంలోని వొదుగు ఎవరైనా ముగ్ధుల్ని చేస్తుంది. నామటుకు నాకు, ఆమెను చూస్తేనూ - మాట్లాడితేనూ తృప్తి. ఆమె ఏమి చదువుతోందో తెలియదు. చదువుకు ఎప్పుడు స్వస్తి చెప్పిందో కూడా తెలియదు. దాదాపు మూడు నాలుగేళ్ళు ఆమె సంగీతాన్ని అప్పుడప్పుడు విని ఆనందించాను. అంతే. ఆమెకు మంచి భవిష్యత్తుందని గట్టిగా అనుకున్నాను ఆమెకు అప్పటికి 15.16 ఏళ్ళు. ముద్దుగా వుండేది. ఎప్పుడూ నవ్వుతూ వుండేది. ఆమె పాట, ఆమె నవ్వు మొగము నేను మరచిపోలేదు. ఎన్నో ఏళ్ళుగా ఆమెను చూళ్ళేదు. నా జీవితం ఆమె సాన్నిధ్యంనుంచి దూరంగా వుండి 30 ఏళ్ళయింది. ఆమె ఎవరో నేనెవరో ఎన్ని ఏళ్ళు నా మనస్సులో మెదలిందీ! అనుకొంటే చాల విచిత్రంగా వుంటుంది.

మూడు నాలుగేళ్ళ క్రిందట ఒకసారి అనంతపురంలో ఒక తియ్యని కంఠం పలుకరించింది. ఎవరా అని ఆశ్చర్యంగా నిలిచిపోయాను. గుర్తు పట్టలేనందుకు సిగ్గుపడుతూ వుంటే "ఏమప్పా నేను మీనాక్షిని "నగుమోము గనలేని" అని కొంటెగా హెచ్చరించింది. ఎంత ఆనందం పొందానో చెప్పలేను. ఆమె నన్ను కనుక్కొంది. నేనామెను గుర్తుపట్టలేకపోయాను. చాలా సిగ్గుపడ్డాను, రెండు మూడు క్షణాలు మౌనంగా ఒకరినొకరు చూసుకొన్నాం.

"మీనాక్షీ ఎంత మారిపోయావు!"అని అన్నాను. ఆమెలో ఒక కలిక బయలుదేరింది, విపరీతమైన బాధ శరీరమంతా ఆవరించిందేమో. మీనాక్షి మొగముదీనమైపోయింది. కన్నుల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. నాకు అంతుపట్టలేదు ఆమెను ఎట్లా ఓదార్చాలో నాకు తెలియలేదు.